సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 28 । డిసెంబర్ । 2023



ఆటాడేద్దాం.. రండి

ఇల్లెందు మండలం సుభాష్‌నగర్‌లో గిరిజన గురుకులాల బాలికల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నేటి నుంచి జరగనున్నాయి.

10లో



ఉద్యమకారులకు సంక్షేమబోర్డు

తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు కోరారు.

10లో

గరిష్టం / కనిష్టం

30° / 18°

వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల వ్యయ రికార్డులు అందజేయాలి



మాట్లాడుతున్న డీసీఓ వెంకటేశ్వర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకు సంబంధించిన రికార్డులను అందజేయాలని జిల్లా సహకార అధికారి, ఎన్నికల వ్యయ పరిశీలన నోడల్ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 29న కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి నిర్వహించే అకౌంట్స్ రీ కన్సిలేషన్ సమావేశంలో నివేదికలు అందించాలని కోరారు. సమావేశంలో సహాయ వ్యయ పరిశీలకులు వేల్పుల శ్రీనివాస్, దాసరి మహేష్‌కుమార్, సీహెచ్ కోటయ్య, ఎ.నాగరాజు, కె.శంకరాచారి, పోటీ చేసిన అభ్యర్థులు పాడియం బాలరాజు, కారం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలోని 23 పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 100 శాతం తరగతులకు హాజరయ్యేలా ఆయా సబ్జెక్ట్ టీచర్లు పర్యవేక్షించాలని సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతిరోజు స్లిప్ టెస్ట్, వారానికి వీక్లీ టెస్ట్ తప్పక నిర్వహించాలని చెప్పారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతిరోజూ పౌష్టికాహారం అందేలా వార్డెన్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, నర్సింహారావు, అలివేలు మంగతాయారు, రమణమూర్తితో పాటు హెచ్‌ఎంలు, వార్డెన్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్–ప్రత్యామ్నాయంపై 4న పోటీలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ఎన్‌జీసీ(ఎకో క్లబ్) ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ – ప్రత్యామ్నాయ మార్గం అనే అంశంపై జనవరి 4న నేషనల్ గ్రీన్ కార్ప్స్(ఎన్‌జీసీ) విద్యార్థులకు నాటిక, ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి, ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ చలపతిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలు ఈనెల 30వ తేదీనే జరగాల్సి ఉండగా, ఇటీవలి వరుస సెలవుల దృష్ట్యా వాయిదా వేశామని పేర్కొన్నారు. జిల్లాలోని కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలు, ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన ఎన్‌జీసీ విద్యార్థులు మాత్రమే పోటీలకు అర్హులని వివరించారు. నాటికకు ప్రతి పాఠశాల నుంచి ఒక్కో జట్టు (ఐదుగురు) మాత్రమే పాల్గొనాలని, ఏకపాత్రాభినయంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3వేలు, ద్వితీయ బహుమతి రూ.2వేలు ఇస్తామని పేర్కొన్నారు. పాల్గొనే పాఠశాలలు జనవరి 4వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9247296012 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జమలాపురం ఆలయ ఆదాయం రూ.36 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న ఉద్యోగులు, భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు సమక్షాన లెక్కించగా 92 రోజులకు గాను రూ.36,55,896 ఆదాయం సమకూరింది. లెక్కింపులో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారితో పాటు అర్చకులు, సిబ్బంది, మధిరకు చెందిన సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

టైం కలిసొచ్చింది

జిల్లాలోని నాలుగు ఏరియాల్లో ఐఎన్‌టీయూసీ విజయం

- అన్నిచోట్ల ఏఐటీయూసీ నుంచి గట్టి పోటీ
- మణుగూరులో గణనీయమైన ఓట్లు సాధించిన టీబీజీకేఎస్
- గుర్తింపు సంఘంగా మాత్రం ఏఐటీయూసీ



కొత్తగూడెం హెడ్డాఫీస్ వద్ద ఐఎన్‌యూటీసీ నాయకుల సంబరాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో బుధవారం జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు ఏరియాల్లోనూ కాంగ్రెస్ – ఐఎన్‌టీయూసీ అనుబంధ కార్మిక సంఘమైన సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (గడియారం గుర్తు) ఘన విజయం సాధించింది. ఏఐటీయూసీ నుంచి గట్టి పోటీ ఎదురైనా ఐఎన్‌టీయూసీ జయకేతనం ఎగురవేసింది. అయితే, సంస్థలో కీలకమైన రామగుండం, శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల్లో వచ్చిన మెజారిటీతో సీపీఐ – ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు హోదా దక్కించుకుంది.

ఇల్లెందుతో మొదలు

ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఆతర్వాత రాత్రి ఏడు గంటలకు ఓట్ల లెక్కింపు మొదలుపెట్టారు. ఇల్లెందు ఏరియాలో 604 ఓట్లు మాత్రమే పోల్ కావడంతో తొలి ఫలితం అక్కడి నుంచే వెలువడింది. ఏఐటీయూసీపై 40 ఓట్ల తేడాతో ఈ ఏరియాలో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. రాత్రి 9 గంటల సమయంలో ఫలితం వెల్లడవగా 9–20 గంటలకు కార్పొరేట్ ఏరియాలోనూ బీఎంఎస్‌పై ఐఎన్‌టీయూసీ విజయం సాధించినట్లుగా ఫలితం వెల్లడించారు. ఇరవై నిమిషాల వ్యవధిలో రెండు ఏరియాల్లోనూ ఐఎన్‌టీయూసీ విజయం సాధించడంతో సింగరేణి ప్రధాన కార్యాలయం దగ్గరకు ఐఎన్‌టీయూసీ మద్దతుదారులు, కాంగ్రెస్ నేతలు భారీగా చేరుకుని బాణసంచా కాలుస్తూ సంబురాలు చేసుకున్నారు. నృత్యాలు చేస్తూ పులిబిడ్డ పొంగులేటి అని నినదించారు. కొత్తగూడెం ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సైతం అక్కడికి చేరుకుని విజయోత్సవంలో పాలు పంచుకున్నారు.

సత్తా చాటిన బీఎంఎస్

సింగరేణి కార్పొరేట్ ఏరియాలో బీజేపీ అనుబంధ బీఎంఎస్ కార్మిక సంఘం సత్తా చాటింది. మిగిలిన ఏరియాల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయినా కార్పొరేట్‌లో ఎలాగైనా గెలుపు సాధించాలనే లక్ష్యంతో నాయకులు శ్రమించారు. వీరికి కమలనాథుల నుంచి అండదండలు కూడా లభించాయి. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లాంటి ఉద్దండులను ఎదుర్కొంటూ ప్రచారం నిర్వహించారు. అయితే తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. అయితే ఇక్కడ గెలుపుపై ఆశలు పెట్టుకున్న ఏఐటీయూసీని వెనక్కి నెట్టి రెండో స్థానంలో నిలవడం విశేషంగానే చెప్పుకోవాలి.

గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ

సింగరేణి గుర్తింపు సంఘంగా మరోసారి ఏఐటీయూసీ గెలుపు సాధించింది. భద్రాద్రి జిల్లాలోని నాలుగు ఏరియాల్లో ఐఎన్‌టీయూసీ స్పష్టమైన ఆధిక్యం చూపించినా మిగిలిన ఏరియాల్లో ఏఐటీయూసీ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్లడంతో ఐఎన్‌టీయూసీకి నిరాశ ఎదురైంది. శ్రీరాంపూర్, రామగుండం–1, 2 ఏరియాలతో పాటు మందమర్రి, బెల్లంపల్లిల్లో ఏఐటీయూసీ భారీ మెజార్టీతో గెలుపు సాధించింది. శ్రీరాంపూర్ ఏరియాలో ఏకంగా రెండు వేలకు పైగా మెజారిటీ రావడం ఏఐటీయూసీకి కలిసొచ్చింది. దీంతో సింగరేణి వ్యాప్తంగా మొత్తం పోలైన ఓట్లలో యాభై శాతానికి పైగా ఏఐటీయూసీ దక్కించుకుంది. ఐఎన్‌టీయూసీ గత ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపించకపోయినా ఈసారి ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మంలోని నాలుగు ఏరియాలతో పాటు భూపాలపల్లి, రామగుండం–3 ఏరియాల్లో విజయం సాధించింది.

ఏరియాల వారీగా సంఘాలకు నమోదైన ఓట్లు

కార్మిక సంఘం	మణుగూరు	ఇల్లెందు	కొత్తగూడెం	కార్పొరేట్
ఐఎన్‌టీయూసీ	778	311	1,129	587
ఏఐటీయూసీ	776	264	896	253
టీబీజీకేఎస్	728	01	36	32
సీఐటీయూ	66	07	48	40
ఐఎఫ్‌టీయూ	05	07	04	01
బీఎంఎస్	07	09	48	263
హెచ్‌ఎంఎస్	13	03	39	04

ఏరియా	విజయం	సమీప ప్రత్యర్థి	మెజార్టీ
కొత్తగూడెం	ఐఎన్‌టీయూసీ	ఏఐటీయూసీ	233
కార్పొరేట్	ఐఎన్‌టీయూసీ	ఏఐటీయూసీ	324
ఇల్లెందు	ఐఎన్‌టీయూసీ	ఏఐటీయూసీ	46
మణుగూరు	ఐఎన్‌టీయూసీ	ఏఐటీయూసీ	02

నాలుగోసారి

సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు 1998 నుంచి మొదలుకాగా రెండు సార్లు టీబీజీకేఎస్, ఒకసారి ఐఎన్‌టీయూసీ, మూడు సార్లు ఏఐటీయూసీ గుర్తింపు సంఘం హోదా దక్కించుకున్నాయి. తాజా ఎన్నికల్లో గెలిచిన ఏఐటీయూసీ నాలుగోసారి గుర్తింపు హోదా సాధించింది.

స్వల్పంగా తగ్గిన పోలింగ్..

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గతంతో పోల్చితే ఈసారి స్వల్పంగా పోలింగ్ తగ్గింది. గత ఎన్నికల సమయానికి, ఇప్పటికి సంస్థ వ్యాప్తంగా మూడు వేల మందికి పైగా కార్మికుల సంఖ్య తగ్గింది. సాధారణంగా తక్కువ సంఖ్యలో కార్మికులు ఉన్నప్పుడు పోలింగ్ శాతం పెరగాలి. కానీ గతంలో సింగరేణి వ్యాప్తంగా 94.94 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి 94.20 శాతానికి తగ్గింది.

మణుగూరులో ఉత్కంఠ

మణుగూరు ఏరియాలో లెక్కింపు ప్రక్రియ ఉత్కంఠగా సాగింది. ఇక్కడ గెలుపు కోసం ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీతో పాటు టీబీజీకేఎస్ కూడా పోటీ పడింది. దీంతో ప్రతీ రౌండ్‌కు ఆధిక్యం మారుతూ వచ్చింది. తొలుత ఏఐటీయూసీ గెలుపొందిందనే వార్తలు బయటకు వచ్చాయి. కానీ చివరకు ఏఐటీయూసీపై కేవలం రెండు ఓట్ల మెజారిటీతో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. దీంతో మరోసారి లెక్కించాలంటూ మిగిలి కార్మిక సంఘాల నాయకులు కోరినా ఎన్నికల అధికారులు అంగీకరించలేదు. చివరకు ఐఎన్‌టీయూసీనే మణుగూరు ఏరియా విజేతగా ప్రకటించారు. ఈ ఏరియాలో విజయం సాధించిన ఐఎన్‌టీయూసీకి 778 ఓట్లు రాగా, టీబీజీకేఎస్ 728 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచింది.

ప్రశాంతంగా పోలింగ్



ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులు

ఏరియాల వారీగా వివరాలిలా..

ఏరియా	కార్మికుల సంఖ్య	ఓటు వేసినవారు	శాతం
కార్పొరేట్	1,191	1,146	96.14
కొత్తగూడెం	2,326	2,207	94.88
ఇల్లెందు	614	604	98.37
మణుగూరు	2,450	2,378	97.06

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ సాగింది. మొత్తం 39,773 మంది ఓటర్లు ఉండగా 37,458 (94.20 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నుంచే కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. అత్యధికంగా ఇల్లెందు ఏరియాలో 98.37 శాతం, అత్యల్పంగా రామగుండం– 3 ఏరియాలో 93 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీవైసీఎల్సీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణివ్యాప్తంగా గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) దేవరకొండ శ్రీనివాసులు తెలిపారు. కార్పొరేట్ పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాలతో పాటు కాన్ఫరెన్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సింగరేణి సెక్యూరిటీ, పోలీస్ సిబ్బంది సమర్థంగా విధులు నిర్వహించారని చెప్పారు. ఆయన వెంట ఏఆర్‌ఓ రామదుర్గ ప్రసాద్, ఏఎస్‌డీ రమేష్‌కుమార్, సింగరేణి పర్సనల్ జీఎం బి.హనుమంతరావు, డీజీఎం అజయ్‌కుమార్ ఉన్నారు.

ఓటర్ల జాబితా తయారీలో భాగస్వాములు కండి

రాజకీయ పార్టీలకు అదనపు కలెక్టర్ సూచన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేటరూరల్: ఓటర్ల జాబితా తయారీలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని జిల్లా అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం మరోసారి పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, సరవణకు ఫారం 6, 7, 8 ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలో ఏజెంట్‌లను నియమించుకోవాలని, ఆ జాబితాను వచ్చే బుధవారం నాటికి అందజేయాలని కోరారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, సీపీఎం, బీఆర్‌ఎస్, సీపీఐ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్జీలకు వేళాయె..

- 'ప్రజాపాలన'కు నేడు శ్రీకారం
- జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- గ్రామసభలకు ఏర్పాట్లు పూర్తి



చుంచుపల్లి మండలం ఎన్‌కే నగర్‌లో దరఖాస్తు ఫారాలను ప్రజలకు అందిస్తున్న అధికారులు, సిబ్బంది

చుంచుపల్లి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ అయిన ఆరు గ్యారంటీల అమలుకు చర్యలు వేగవంతం చేసింది. ఈ క్రమంలో గురువారం నుంచి జనవరి 6 వరకు గ్రామసభలు ఏర్పాటు చేసి అర్హుల నుంచి అర్జీలు స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఖమ్మంలో సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మొదట 1000 లోపు జనాభా ఉన్న గ్రామాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. 28, 29 తేదీల్లో చిన్న గ్రామ పంచాయతీలు, 30, జనవరి 2 నుంచి 6 తేదీల్లో పెద్ద పంచాయతీల్లో అర్జీలను స్వీకరించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో నేటి నుంచే సభలు నిర్వహించనున్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యం

జిల్లాలోని 481 గ్రామపంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 104 వార్డుల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రజాపాలనలో అందించాల్సిన దరఖాస్తు ఫారాలను గ్రామ సభల కంటే ముందుగానే ప్రజలకు ఉచితంగా అందజేస్తున్న అధికారులు.. వాటిని ఎలా పూర్తి చేయాలో వివరిస్తున్నారు. ఆధార్, రేషన్‌కార్డు నకళ్లను దరఖాస్తుతో పాటు జత చేసి ఇవ్వాలని చెబుతున్నారు. దరఖాస్తుల స్వీకరణ తర్వాత తిరిగి రసీదు అందజేస్తారు. ప్రభుత్వ పథకాలకు అర్హుల ఎంపిక, వార్డుల వారీగా సభల నిర్వహణకు మున్సిపల్, రెవెన్యూ, మండల అధికారులతో బృందాలను ఏర్పాటు చేశారు. గ్రామ సభల సందర్భంగా మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత వంటి పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీ, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ప్రతి 100 కుటుంబాలకు ఒకటి చొప్పున ఐదు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. మహిళలు, దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఉంటాయి. ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించే తేదీ, సమయం వంటి వివరాలను ముందుగానే దండోరా వేసి గ్రామస్తులకు తెలియపరుస్తారు. గ్రామసభల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కాగా, గ్రామసభల నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించేందుకు చుంచుపల్లిలో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా రఘునందన్‌రావు



సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాపాలన సభలు గురువారం నుంచి ప్రారంభం కానుండగా ఉమ్మడి జిల్లాల వారీగా ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఎం.రఘునందన్‌రావును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన సభలను పర్యవేక్షిస్తారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

కలెక్టర్ ప్రియాంక ఆల



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి నిర్వహించే ప్రజాపాలన సభల్లో అభయహస్తం గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. బుధవారం ఆమె అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల స్థాయిలో పర్యవేక్షణకు ఐదుగురు, ప్రతీ మండలానికి ఒకరు చొప్పున మరో 22 మంది ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామసభలపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. ప్రజాపాలన గ్రామ సభల నిర్వహణ సమాచారం, దరఖాస్తు ప్రతి కుటుంబానికి చేరాలన్నారు. దరఖాస్తులు పూర్తి చేయడానికి హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గురువారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామసభలు జరుగుతాయని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం సిబ్బంది సభలకు చేరుకోవాలని సూచించారు. ప్రతి దరఖాస్తుకు నంబరు వేసి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అశ్వారావుపేట మండలంలో కొండరెడ్ల ఆవాసాల వద్ద గ్రామసభ నిర్వహించి దరఖాస్తులు తీసుకోవాలని చెప్పారు. తమకు సమాచారం అందలేదని ఎక్కడా ప్రజల నుంచి ఫిర్యాదుల రావొద్దన్నారు. దరఖాస్తుతో పాటు రేషన్, ఆధార్‌కార్డుల జిరాక్సులు, కుటుంబ పెద్ద పాసుపోర్ట్ ఫొటో జతచేయాలని కలెక్టర్ వివరించారు.

గ్రామసభలను జయప్రదం చేయాలి

జెడ్పీ సీఈఓ విద్యాలత



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే ప్రజాపాలన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జెడ్పీ సీఈఓ విద్యాలత కోరారు. బుధవారం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అభయ హస్తం 6 గ్యారెంటీల అమలులో భాగంగా ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హుల నుంచి ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు గ్రామసభల్లో దరఖాస్తు పత్రాలను స్వీకరించాలన్నారు. గురువారం నల్లబండబోడు, అనంతారం, శంభునిగూడెం, గురువాగు తండాల్లో ప్రజాపాలన గ్రామసభలు జరగనున్నట్లు ఆమె చెప్పారు. కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ మాట్లాడుతూ ఆధార్ కార్డు, రేషన్ కార్డుల జిరాక్స్ కాపీల కోసమని ప్రజల నుంచి వసూళ్లు చేస్తే జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని, షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి భీమ్లా నాయక్, తహసీల్దార్ శారద, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ తులసిరామ్, ఎస్‌ఐ పురుషోత్తం, ఎంపీపీ లావుడ్యా సోనీ, వైస్ ఎంపీపీ గాదె నిర్మల, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్విని, ఏపీఎం సత్యనారాయణరాజు, సర్పంచ్‌లు సెక్రటరీలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దమ్మక్క మండపంలో నిలిచిన రాపత్తు సేవ

- భద్రతా కారణాలను చూపుతున్న దేవస్థానం వర్గాలు
- పురుషోత్తపట్నం రాముడితో ఆ గ్రామస్తుల పూజలు



పురుషోత్తపట్న రాముడికి పూజలు చేస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా ఏపీలోని పురుషోత్తపట్నం గ్రామంలో బుధవారం జరగాల్సిన రాపత్తు సేవ నిలిచిపోయింది. ఎన్నో సంవత్సరాల పాటు ఆనవాయితీగా వస్తున్న ఈ వేడుకను దేవస్థానం అధికారులు రామాలయంలోనే కానిచ్చేశారు. దీంతో పురుషోత్తపట్నం వాసులు ఆ గ్రామ రామాలయంలో వేంచేసి ఉన్న మూర్తులతో రాపత్తు సేవ నిర్వహించుకున్నారు.

భద్రతా కారణాలు చూపుతూ..

పురుషోత్తపట్నంలో ఉన్న రాముడి భూముల్లో గత కొన్ని నెలలుగా వివాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భూములను అప్పగించాలని, అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేయాలని దేవస్థానం వర్గాలు కోరుతుండగా, ఆ భూములు తమవేనంటూ ఆ గ్రామస్తులు ప్రతిఘటించటంతో పలుమార్లు వివాదాలు, తోపులాటలు జరిగాయి. కాగా, అధ్యయనోత్సవాల్లో భాగంగా పురుషోత్తపట్నం గ్రామంలోని ఆలయ భూముల్లో బుధవారం రాపత్తు సేవ జరగాల్సి ఉండగా గతంలో భూముల్లో దేవస్థానం ఉద్యోగులపై దాడులు జరిగాయని, రాపత్తు సేవకు వెళ్తే మళ్లీ దాడులు జరిగే అవకాశం ఉందని, భద్రతపై ఆ గ్రామ వాసులు హామీ పత్రం ఇస్తే రాపత్తు సేవకు వస్తామని ఆలయ అధికారులు తెలిపారు. అయితే ఈ విషయమై వారి నుంచి సరైన స్పందన రాలేదని, హామీ పత్రం ఇవ్వనందున ఉన్నతాధికారులకు పరిస్థితిని నివేదించి రాపత్తు సేవ నిలిపేశామని చెబుతున్నారు. తరతరాలుగా పురుషోత్తపట్నంలో జరుగుతున్న రాపత్తు సేవను భద్రత సాకుతో నిలిపివేయటం సరికాదని ఆ గ్రామస్తులు అంటున్నారు. భూముల వివాదం పేరుతో సంప్రదాయానికి మంగళం పాడిన ఆలయ ఈఓ, వైదిక కమిటీ వారు తమపై వివక్ష చూపారని ఆరోపిస్తున్నారు. అయినా రాముడిపై ఉన్న భక్తితో తామే రాపత్తు సేవ నిర్వహించుకున్నామని చెప్పారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

స్పందన లేకపోవడంతోనే రద్దు చేశాం

పురుషోత్తపట్నంలో జరగాల్సిన రాపత్తు సేవపై మా ఉద్యోగులు, వైదిక కమిటీ అభ్యంతరం తెలిపారు. దీంతో ఏపీ, తెలంగాణ పోలీసుల భద్రత కావాలని ఆ గ్రామస్తులకు ముందుగానే తెలియజేశాం. అయినప్పటికీ వారు స్పందించలేదు. గ్రామ పెద్దలు కాకుండా మొక్కుబడిగా ఇద్దరు గ్రామస్తులను పంపి నింద మాపై మోపుతున్నారు. వారి నుంచి మాకు భద్రతపై హామీ లభించకపోవడంతోనే రద్దు చేశాం.

–ఎ.రమాదేవి, ఈఓ

క్లుప్తంగా

గుండెపోటుతో రైతు మృతి


సీతారాములు (ఫైల్)

చండ్రుగొండ : చండ్రుగొండలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన రైతు, ఎంఆర్‌పీఎస్ నాయకుడు పెంబుల సీతారాములు (45) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య జమలమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దార వెంకటేశ్వరరావు, భోజ్యానాయక్, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు మధు, వివిధ రాజకీయ, కులసంఘాల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

చర్లలో కాంగ్రెస్ నాయకుడు..


వెంకట్ (ఫైల్)

చర్ల: మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లంకా వెంకట్ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని సత్యనారాయణపురానికి చెందిన లంకా వెంకట్ (47) ప్రస్తుతం చర్లలో నివాసముంటున్నాడు. బుధవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా గుండెపోటు వచ్చి ఇంటి ముందే కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని పలువురు రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖులు సందర్శించి సంతాపం తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


వంశీ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం .. మండలంలోని పేరాయిగూడేనికి చెందిన రావూరి వంశీ(24) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్న సమయంలో స్థానిక కెమిలాయిడ్స్ ఫ్యాక్టరీ వెనుక ప్రాంతంలో ఉన్న ఓ మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశువుల కాపరులు గమనించి, గ్రామస్తుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అదనపు ఎస్సై శివరామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవ పంచనామా కోసం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడు అవివాహితుడుకాగా తల్లిదండ్రులు, అన్న, చెల్లి ఉన్నారు. కుటుంబీకుల నుంచి ఫిర్యాదు రాలేదని, వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.40 వేలు స్వాహా

భద్రాచలంఅర్బన్: సైబర్ నేరస్తుడు రూ. 40 వేలు స్వాహా చేశాడు. భద్రాచలం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఫోన్‌కు రూ.40 వేలను తన ఫోన్ పే లో యాడ్ చేసుకోవాలని మెసేజ్ వచ్చింది. దీంతో ఫోన్‌కు వచ్చిన ఓటీపీని ఫోన్ పే లో టైప్ చేశాడు. వెంటనే సదరు వ్యక్తి అకౌంట్ నుంచి రూ.40 వేల నగదు సైబర్ నేరగాడి అకౌంట్‌కు బదిలీ అయింది. బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు. సైబర్ పోలీసులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.

ట్రాలీ ఢీకొని ఇద్దరికి గాయాలు


రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. రఘునాథపాలెం సీఐ శ్రీధర్ కథనం ప్రకారం.. ఏన్కూరు మండలం జన్నారానికి చెందిన రేగళ్ల వెంకటయ్య, నర్సింహారావు పండితాపురం సంతలో మేకల కొనుగోలుకు రాగా, మంచుకొండలో మేకలు ఉన్నాయని చెప్పడంతో ఇక్కడకు వచ్చి, రోడ్డు పక్కన ద్విచక్రవాహనం నిలిపి మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో ట్రాలీని వేగంగా నడుపుకుంటూ వచ్చిన డ్రైవర్ వీరిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయాడు. స్థానికులు వెంబడించినా ట్రాలీ ఆచూకీ లభించకపోవడంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రైవేట్ కాలేజీ అధ్యాపకుడు ఆత్మహత్య


కుసుమరాజు సురేశ్ (ఫైల్)

సత్తుపల్లిటౌన్: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సత్తుపల్లి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కుసుమరాజు సురేశ్ (34) స్థానిక ప్రైవేట్ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన భార్య లక్ష్మీదుర్గ తెలిసిన వారికి ఆరోగ్యం బాగాలేదని మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లింది. అప్పటికే కుటుంబ కలహాలు ఉన్నట్లు తెలుస్తుండగా, సురేశ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య ఫోన్ చేసినా స్పందించకపోవటంతో పక్కింటి వారికి ఫోన్ చేసి పంపించగా వారు చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా, సురేశ్‌కు భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

సింగరేణిలో ఎన్నికల సందడి

సింగరేణి సంస్థలో బుధవారం గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల హడావిడి నెలకొంది. కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, సత్తుపల్లి ప్రాంతాల్లోని గనులు, కార్యాలయాలు సందడిగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోగా, రాత్రి ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించారు. విజేతలు సంబరాలు జరుపుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంలో కార్మిక సంఘాల నాయకుల హడావుడి



మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగి


కొత్తగూడెంలో గుర్తింపు కార్డులు చూపిస్తున్న కార్మికులు


పోలింగ్‌ను పర్యవేక్షిస్తున్న జీఎం షాలేమురాజు, డీఎస్పీ రెహమాన్


హెడ్డాఫీస్ వద్ద అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ తదితరుల విజయోత్సాహం


ఇల్లెందు: పోలింగ్ బూత్‌లో పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు


ఓటు వేసిన ఉద్యోగులు


ఇల్లెందు: కార్మిక నాయకులతో చర్చిస్తున్న సీఐ


సత్తుపల్లి: ఎన్నికల శిబిరంలో కార్మికులతో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి


ఇల్లెందు: పోలింగ్ కేంద్రం సమీపంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు


మణుగూరు: కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మంగీలాల్, అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రజాపాలన సభలను విజయవంతం చేయండి
- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్: పార్టీలు, పక్షపాతం లేకుండా అర్హులైన పేదలందరికీ ఆరు గ్యారంటీలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. సత్తుపల్లి మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన కార్యక్రమంపై బుధవారం నిర్వహించిన సమీక్షల్లో ఆమె మాట్లాడారు. గురువారం నుంచి వచ్చేనెల 6వ తేదీ నుంచి జరిగే సభల్లో దరఖాస్తుల స్వీకరణకు ఇబ్బంది ఎదురు కాకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా పేదలకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రజాపాలన సభల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడమే కాక హెల్ప్‌డెస్క్‌లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, ఎంపీపీ దొడ్డా హైమావతి, ఎంపీడీఓ జయరాం, తహసీల్దార్ యోగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా మాజీల ఫొటోలు ఏమిటీ

సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయ గదుల్లో మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే చిత్రపటాలను గమనించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఇంకా ఎందుకు తొలగించలేదని కమిషనర్ కె.సుజాతను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 24 రోజులైనా సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఎందుకు పెట్టలేదని అడిగారు. తొలుత ఎమ్మెల్యే రాగమయికి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ మొక్క అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు, నాయకులు దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతి, మౌలాలి, ఎండీ కమల్‌పాషా, గాదె చెన్నారావు, ఎస్కే రఫీ, మందపాటి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అందరికీ ఉచితమే.. నీతో పనేంటి?

మహిళా కండక్టర్‌తో ప్రయాణికుల వాగ్వాదం


కన్నీటి పర్యంతమవుతున్న కండక్టర్

బూర్గంపాడు: ఆర్టీసీ బస్సు ఎక్కిన ప్రయాణికులు మహిళా కండక్టర్ వచ్చేందుకు చోటు ఇవ్వడమే కాక ఆమె అవసరమే లేదని వాగ్వాదానికి దిగిన ఘటన ఇది. భద్రాచలం డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు బుధవారం మధ్యాహ్నం భద్రాచలం నుంచి కొత్తగూడెం బయల్దేరింది. ఈ క్రమంలో బూర్గంపాడు వచ్చేసరికి పూర్తిగా నిండగా, కొందరు నిలబడి.. మరికొందరు ఫుట్‌బోర్డుపై ఉన్నారు. దీంతో లోపలకు రావాలని మహిళా కండక్టర్ కోరినా వినలేదు. ఈమేరకు ఆమె బస్సును బూర్గంపాడులోని గౌతాపురం సమీపాన నిలిపివేయగా, అందరికీ ఉచితమే అయినప్పుడు కండక్టర్‌తో పనేంటి అంటూ మహిళా ప్రయాణికులు ఆమెను దుర్భాషలాడారు. దీంతో కన్నీటి పర్యంతమైన కండక్టర్ డిపో అధికారులకు తెలపడం, అంతలోనే స్థానికులు సర్దిచెప్పడంతో బస్సు కొత్తగూడెం బయలుదేరింది.

గోవిందాపురం(ఎల్)లో పత్తి దగ్ధం

పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగులు


రైతుతో మాట్లాడుతున్న సీఐ వసంతకుమార్

బోనకల్: ఆరుగాలం శ్రమించి రైతు పత్తిని పండించి నిల్వ చేయగా, గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఇందుకు రాజకీయ కక్షలే కారణమని రైతు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన రైతు ఏసుపోగు వెంకటేశ్వర్లు 15 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, కొద్దిదూరంలో ఉన్న ఒకరి ఇల్లు అద్దెకు తీసుకుని వంద క్వింటాళ్ల మేర పత్తి నిల్వ చేశారు. అయితే, గుర్తుతెలియని దుండగులు బుధవారం తెల్లవారుజామున ఇంటి తలుపులపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో తలుపులు కాలి పత్తికి సైతం మంటలు అంటుకున్నాయి. గది నుండి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు రైతుకు సమాచారం ఇచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే ఎనిమిది క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. ఈ మేరకు మధిర సీఐ వసంతకుమార్, ఎస్‌ఐ సాయికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రామంలో రాజకీయ కక్షలతోనే తన పత్తికి నిప్పంటించినట్లు తెలిపారు. ఆయన కొందరు అనుమానితుల పేర్లను పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. కాగా, ఇటీవల గోవిందాపురం(ఎల్)లో హత్య జరగగా 18 మందిని రిమాండ్‌కు పంపించిన పోలీసులు కొన్నిరోజులు బందోబస్తు నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు పత్తికి నిప్పంటించడంతో ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ముమ్మరంగా వరిసాగు


వరినారు కట్టలు కడుతున్న కూలీలు

కరకగూడెం: మండలంలో రబీ సీజన్ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సాగు పనుల్లో అన్నదాతలు బిజీగా మారారు. రైతులు దమ్ము చేస్తూ, ఎడ్ల బండ్లలో నారు తరలిస్తుండగా, కూలీలు నాట్లు వేస్తుండటంతో పొలాల్లో సందడి నెలకొంది.


నాట్లు వేస్తున్న కూలీలు

వంటషెడ్ నిర్మాణాన్ని అడ్డుకున్న విద్యార్థులు


కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగిన విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని గిరిజన కళాశాల బాలుర 'బీ' వసతిగృహం ఆవరణలో నిర్మిస్తున్న వంటషెడ్ పనుల్లో నాణ్యత పాటించడం లేదని ఆరోపిస్తూ విద్యార్థులను పనులను అడ్డుకున్నారు. బేస్‌మెంట్‌లో మట్టి పోసి, వెంటనే కంకర పోస్తున్నారని.. నీళ్ల పెట్టకపోతే ఎలుకలు, పందికొక్కులు తోడే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. ఏళ్లుగా షెడ్ లేక ఇబ్బంది పడగా ఇప్పుడు రూ.7లక్షలతో నిర్మిస్తుండగా నాణ్యత పాటించకపోవడం సరికాదన్నారు. ఈమేరకు పనులను అడ్డుకున్న విద్యార్థులు విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వారు వివరాలు సేకరించారు. ఈ అంశంపై అధికారులను వివరణ కోరగా నిబంధనల ప్రకారం షెడ్డు నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్లు తెలిపారు.

గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు

అశ్వారావుపేటరూరల్: పంచాయతీల వారీగా ప్రజాపాలన గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, గృహజ్యోతి, చేయూత, యువ వికాసం పథకాలకు సంబంధించి ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు పంచాయతీల ఆధ్వర్యంలో అంతా సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలో ప్రతి 100 కుటుంబాలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీఓల పర్యవేక్షణలో ఐదు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు చేసే వారు తప్పనిసరిగా ఆధార్, రేషన్ కార్డు(ఇప్పటికే ఉంటే)ను జత చేయాల్సి ఉంటుందన్నారు. సభల వద్ద అధిక రద్దీ ఉంటే టోకెన్లను జారీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎస్‌ఐ శివరామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చర్ల: పాదచారుడిని ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం జరిగింది. వివరాలు ఇలా..మండలంలోని వీరాపురంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ అయ్యప్ప మాలధారణ చేసి ఉన్న అనంత వెంకటకృష్ణ ఆర్.కొత్తగూడెం వెపు నుంచి కుదునూరుకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో ఇరకం చిట్టిబాబు అనే యువకుడు చర్ల వైపు నుంచి కుదునూరుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి ఢీకొట్టడంతో అనంత వెంకటకృష్ణతోపాటు చిట్టిబాబు కూడా తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సత్యనారాయణపురం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా అనంతకృష్ణ ఖమ్మం జిల్లాలోని వేంసూరువాసికాగా, ఇరకం చిట్టిబాబు కుదునూరు గ్రామస్తుడు.

ఫిట్స్‌తో ఆర్టిజన్ కార్మికుడు మృతి

పాల్వంచ: ఫిట్స్‌తో బుధవారం ఆర్టిజన్ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాత సూరారానికి చెందిన సోమనబోయిన రాములు(48) కేటీపీఎస్‌లో ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా ఫిట్స్, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఇంటి వద్దే ఫిట్స్ మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్ : ఒకరు మృతి

అశ్వారావుపేటరూరల్: ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన కాళింగుల బజార్‌కు చెందిన పి. వెంకటేష్(26)అశ్వారావుపేట నుంచి ద్విచక్రవాహనంపై ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో జీలుగుమల్లి మండలం లక్ష్మీపురం వద్ద ముందు వెళ్తున్న ఓ ట్రాక్టర్ టైరు ఒక్కసారిగా పంక్చరై, అదుపు తప్పింది. దీంతో వెనుకే ఉన్న ద్విచక్రవాహనం ఒక్కసారిగా ట్రాక్టర్‌ను ఢీకొట్టగా, వెంకటేష్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కాగా వెంకటేష్ స్థానికంగా తాపీ వర్కర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. జీలుగుమిల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వైరా: ద్విచక్రవాహనం పైనుంచి కింద పడిన వ్యక్తి పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వైరా మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ మేడా ప్రసాద్ కథనం మేరకు.. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మల్యాల హనుమంతరావు (32) తన మేనల్లుడు బండి వినయ్‌తో కలిసి తల్లాడ నుంచి వెంకటాయపాలెం వెళ్తుండగా వైరా వేీబ్రిడ్జి సమీపాన వాహనం అదుపు తప్పింది. హన్మంతరావు రోడ్డుపై పడిపోగా, వినయ్ రోడ్డు పక్కన చెట్లలో పడ్డాడు. అదే సమయాన వెనుక నుంచి వస్తున్న లారీ హన్మంతరావు తల పైనుంచి వెళ్లడంతో తల ఛిద్రమై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఓ కూతురు ఉన్నారు. కాగా, హన్మంతరావు గతంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని కారు డ్రైవర్‌గా పనిచేసినట్లు సమాచారం. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వలంటీర్ల ఆగ్రహజ్వాలల్లో పచ్చపత్రికల దహనం

- ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు కథనాలు రాస్తున్నాయి
- ఎల్లోమీడియాకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల నిరసనలు



నాగలదిన్నెలో ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లను దహనం చేస్తున్న వలంటీర్లు

నందవరం/హుకుంపేట/పెదకూరపాడు/కోళ్లపాలెం/కపిలేశ్వరపురం: ఏపీలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సేవాభావంతో నిరంతరం పనిచేస్తున్న వలంటీర్లు.. తమపై వస్తున్న తప్పుడు కథనాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము సమ్మె చేస్తామన్నామని, ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనడంలేదని ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. తప్పుడు వార్తలు రాస్తున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల ప్రతుల్ని పలుచోట్ల దహనం చేశారు. పలు ప్రాంతాల్లో వివిధ పద్ధతుల్లో నిరసన తెలిపారు. ఈనాడు రామోజీ, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఏబీఎన్, ఈటీవీ, టీవీ 5 చానళ్లు అసత్య ప్రసారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. తమకు సమ్మె, నిరసనలు చేసే ఆలోచనలే లేవని ముక్తకంఠంతో నినదించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ఇంటింటికి చేరవేస్తున్న తమపై ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు ప్రచారం చేస్తున్నాయంటూ వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండటంతో ఈ విధమైన అక్కసు వెళ్లగక్కుతున్నాయని చెప్పారు. తమకు ఎలాంటి సమ్మె, నిరసనలు చేసే ఉద్దేశం లేదని, అసత్యవార్తలతో వలంటీర్ల ఐక్యతను దెబ్బతీయలేరని స్పష్టం చేశారు.

..ఏఐటీయూసీ జయభేరి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాతినిధ్యం నిలుపుకోగలిగింది. 2012, 2017లోసత్తా చాటిన బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ ఈఎన్నికల్లో ఖాతా తెరవలేదు.

పోలింగ్ సరళి ఇలా...!: గురువారం ఉదయం నుంచే కార్మికులు బారులుదీరారు. అన్ని ఏరియాల్లో కలిపి ఉదయం 8గంటల వరకు 14.62 శాతం పోలింగ్ నమోదుకాగా, 9గంటలకు 27.05 శాతం, 10గంటలకు 38.67శాతం, 11గంటలకు 49.89శాతం, 12గంటలకు 59.33శాతం, మధ్యాహ్నం 1గంటకు 67.67శాతం 2గంటలకు 75.41శాతం, 3గంటల వరకు 85.92 శాతం, 4గంటలకు 93.09 శాతం , పోలింగ్ ముగిసే సాయంత్రం 5గంటల వరకు మొత్తంగా 94.20 శాతంగా నమోదైంది.

ఎవరు 'ప్రాతినిధ్యం'... ఎవరు గుర్తింపు సంఘం

సింగరేణివ్యాప్తంగా ఉన్న 11ఏరియాలు ఉండగా, ఆయా ఏరియాల్లో అత్యధికంగా ఓట్లు సాధించిన యూనియన్‌ను ప్రాతినిధ్య సంఘంగా గుర్తిస్తారు. పదకొండు ఏరియాల్లోనూ అత్యధికంగా ఓట్లు లభించిన యూని యన్‌ను గుర్తింపు సంఘంగా ప్రకటిస్తారు. సింగరేణిలో ఏడోసారి నిర్వహించిన ఎన్నికల్లో 11 ఏరియాల్లో 6 చోట్ల ఐఎన్‌టీయూసీ 5 చోట్ల గెలిచి ఏఐటీయూసీ ప్రాతినిధ్య సంఘాలుగా విజయం సాధించాయి. మొత్తంగా సింగరేణివ్యాప్తంగా అత్యధిక ఓట్లు సాధించి ఏఐటీయూసీ సంఘం గుర్తింపు సంఘంగా విజయ



సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో ఐఎన్‌టీయూసీ విజయంతో కార్మికుల సంబరాలు

కేతనం ఎగురవేసింది.

2017లో ఇలా: కేవలం రెండు డివిజన్లకే పరిమితమై ఏఐటీయూసీ ఈసారి ఐదు చోట్ల గెలవగా, ప్రాతినిధ్యం లేని ఐఎన్‌టీయూసీ ఆరుచోట్ల గెలవగా, 9 డివిజన్లలో ప్రాతినిధ్యమున్న టీబీజీకేఎస్ ఈసారి అడ్రస్ లేకుండా పోయింది.

ఆయా ఎన్నికల్లో గుర్తింపు ఇలా

1998	- ఏఐటీయూసీ
2001	- ఏఐటీయూసీ
2003	- ఐఎన్‌టీయూసీ
2007	- ఏఐటీయూసీ
2012	- టీబీజీకేఎస్
2017	- టీబీజీకేఎస్
2023	- ఏఐటీయూసీ

ఆయా ఏరియాల్లో ఇలా...

ఏరియా	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	ప్రాతినిధ్యం	మెజారిటీ
రామగుండం-1	5,384	5,054	93.68	ఏఐటీయూసీ	417
రామగుండం- 2	3,556	3,369	94.74	ఏఐటీయూసీ	333
రామగుండం- 3	3,884	3,612	93.00	ఐఎన్‌టీయూసీ	104
భూపాలపల్లి	5,410	5,123	94.70	ఐఎన్‌టీయూసీ	826
బెల్లంపల్లి	996	959	96.29	ఏఐటీయూసీ	122
మందమర్రి	4,835	4,515	93.38	ఏఐటీయూసీ	469
శ్రీరాంపూర్	9,127	8,491	93.03	ఏఐటీయూసీ	2,166
కొత్తగూడెం	2,326	2,207	94.88	ఐఎన్‌టీయూసీ	233
ఇల్లందు	614	604	98.37	ఐఎన్‌టీయూసీ	46
మణుగూరు	2,450	2,378	97.06	ఐఎన్‌టీయూసీ	02
సీఓఆర్‌పీ	1,191	1,146	96.14	ఐఎన్‌టీయూసీ	324
మొత్తం	39,773	37,458	94.20		

అమెరికాలో రోడ్డు ప్రమాదం..
ఐదుగురు ఏపీ వాసుల దుర్మరణం

మృతులంతా ముమ్మిడివరం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పినతండ్రి కుటుంబ సభ్యులు



అమెరికా టెక్సాస్‌లో రోడ్డు ప్రమాద దృశ్యం

అమలాపురం టౌన్: అమెరికాలోని టెక్సాస్‌లో జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. ఇందులో మృతుడు నాగేశ్వరరావు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు స్వయానా పినతండ్రి. నాగేశ్వరరావు(65)తో పాటు ఆయన భార్య సీతామహాలక్ష్మి(60) కుమార్తె పోతాబత్తుల నవీన గంగ(38), ఆమె కుమారుడు కృతిక్(11), కుమార్తె నిషిధ(9) మృత్యువాత పడ్డారు. నాగేశ్వరరావు అల్లుడు పోతాబత్తుల లోకేశ్ తీవ్రంగా గాయపడి అక్కడే ఓ ఆస్పత్రిలో అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. టెక్సాస్ జాతీయ రహదారిపై నాగేశ్వరరావు కుటుంబం కారులో వెళుతోంది. పక్కనే వస్తున్న ట్రక్కు, కారు బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ విషయాన్ని టెక్సాస్‌లోని ఓ న్యూస్ చానల్ ప్రకటించింది. ట్రక్కులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి కూడా మరణించినట్టు పేర్కొంది. అమలాపురంలో పొన్నాడ నాగేశ్వరరావు టింబర్ డిపో వ్యాపారిగా కోనసీమలో గత మూడున్నర దశాబ్దాలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. మూడో కుమార్తె నవీన గంగ కుటుంబం అమెరికాలో స్థిరపడింది. రెండు నెలల కిందట అమలాపురం వచ్చిన నవీన గంగ తిరిగి ఆ దేశానికి వెళుతూ తన తండ్రి నాగేశ్వరరావు, తల్లి సీతామహాలక్ష్మిని వెంట తీసుకుని వెళ్లింది. మంగళవారం సాయంత్రం ఓ పిక్నిక్ స్పాట్‌కు వెళ్లే సమయంలో వారిని మృత్యువు కబళించింది.

రాంగోపాల్ వర్మను చంపుతాం

తామంతా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అనుచరులమంటూ బెదిరింపు

బంజారాహిల్స్ (హైదరాబాద్): ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మను చంపుతామంటూ నినాదాలు చేయడమే కాకుండా ఆయన అంతు చూస్తామంటూ బెదిరిస్తూ కార్యాలయం ముందు దిష్టిబొమ్మ దగ్ధం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ రాంగోపాల్ వర్మ పీఏ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.71లోని రాంగోపాల్‌వర్మ కార్యాలయం వద్దకు ఈనెల 25న రాత్రి 12 నుంచి 15 మంది వరకు వచ్చి నినాదాలు చేస్తూ బెదిరింపులకు గురిచేస్తూ ఆర్జీవీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారని తెలిపారు. ఆ సమయంలో తమతో పాటు ఆర్జీవీ గన్‌మెన్, ఇతర సిబ్బంది అడ్డుకోవడానికి యత్నించగా తమపై దాడికి పాల్పడ్డారని పీఏ జిలాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తామంతా ఏపీ మాజీ సీఎం చంద్రబాబు, నారా లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనుచరులమని చెప్పారన్నారు. వారి నుంచి ఆర్జీవీకి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు.

నా తల నరికే వ్యాఖ్యలను బాబు, పవన్, లోకేశ్‌లు సమర్థిస్తున్నట్టే..



సాక్షి, అమరావతి: 'నా తల నరికితే రూ.కోటి ఇస్తానని అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావు చెప్పిన మాటలను 24 గంటలు గడిచినా చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌లు ఖండించలేదు. అంటే ఆయన మాటలను వారు సమర్థిస్తున్నట్టే భావించాలి' అని ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. టీవీ 5 చానల్లో ఓ డిబేట్‌లో కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యూహం సినిమా తీసిన రామ్‌గోపాల్ వర్మ తలనరికి తెస్తే రూ.కోటి ఇస్తానని ఆఫర్ ఇవ్వడం కలకలం సృష్టించింది. దీనిపై ఈ సినిమా నిర్మాత దాసరి కిరణ్‌కుమార్‌తో కలసి దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం బయట మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తనను చంపడానికి శ్రీనివాసరావు టీవీలో ప్రత్యక్ష ప్రసారం అవుతున్న డిబేట్‌లోనే ఓపెన్ ఆఫర్ ఇచ్చారన్నారు. ఆయన మాటలతో కిరాయి హంతకులు, ఇతరులు ఎవరైనా ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొలికపూడి శ్రీనివాసరావుతో పాటు ఆ డిబేట్‌కు వ్యాఖ్యాత సాంబశివరావు, టీవీ 5 చానల్ యజమాని బీఆర్ నాయుడుపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలు మళ్లీ వాయిదా

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయమే కీలకమవుతుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సైతం బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలపై సమీక్షించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అంతలోనే టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.

గతేడాది డిసెంబర్‌లో విడుదలైన నోటిఫికేషన్..

రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 783 గ్రూప్-2 ఉద్యోగ ఖాళీలకు టీఎస్‌పీఎస్సీ గతేడాది డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగా... రాష్ట్రవ్యాప్తంగా 5.5 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2 పరీక్షలను ఈ ఏడాది ఆగస్టు 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. కానీ టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో పలు రకాల పరీక్షలు రద్దు కాగా, కొన్ని పరీక్షలు రీషెడ్యూల్ అయ్యాయి. ఆ తర్వాత గ్రూప్-2 పరీక్షలను నవంబర్ 2,3 తేదీల్లో నిర్వహించనున్నట్లు కమిషన్ ప్రకటించింది. పరీక్షల సన్నద్ధతకు సమయం కావాలంటూ అభ్యర్థులు ఆందోళన చేయడం, ఈలోగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పరీక్షల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతాయని భావించిన కమిషన్ అధికారులు వచ్చే జనవరి 6, 7 తేదీలకు వాయిదా వేశారు. తాజాగా కమిషన్ చైర్మన్, సభ్యులు లేకపోవడంతో గ్రూప్-2 పరీక్షలు మరోమారు వాయిదా పడ్డాయి.

మళ్లీ మేడిగడ్డ, అన్నారం మునుగుతాయి

- సలహాదారుడు పెంటారెడ్డి హెచ్చరిక
- పంప్‌హౌజ్‌ల కంట్రోల్ యూనిట్‌ను ఎత్తైన ప్రాంతానికి తరలిస్తేనే నష్ట నివారణ
- నిర్మాణసమయంలో ఎత్తు తగ్గించడం వల్లనే పంప్‌హౌజ్‌లు మునిగాయని ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం పంప్‌హౌజ్‌లు మళ్లీ నీటమునిగే ప్రమాదముందని రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారులు పెంటారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన జలసౌధలో మీడియాతో మాట్లాడారు. పంప్‌హౌజ్‌లకు సంబంధించిన కంట్రోల్ యూనిట్‌ను ఎత్తైన సురక్షిత ప్రాంతానికి తరలిస్తేనే మళ్లీ నష్టం జరగకుండా నివారించవచ్చని సూచించారు. మేడిగడ్డ పంప్‌హౌజ్‌ను 126 మీటర్ల ఎత్తులో కట్టడానికి తొలుత అనుమతిస్తే తర్వాత 120 మీటర్లకు తగ్గించి జెన్‌కో నుంచి డిజైన్లకు ఆమోదం తీసుకున్నారని ఆరోపించారు. అన్నారం పంప్‌హౌజ్‌ను తొలుత 131 మీటర్ల ఎత్తులో కట్టడానికి అనుమతిస్తే 125 మీటర్లకు తగ్గించారని తెలిపారు. ఎత్తును తగ్గించడంతోనే పంప్‌హౌజ్‌లు మునిగినట్టు ఆరోపించారు. 2022లో మునిగిన తరహాలోనే మళ్లీ ఈ రెండు పంప్ హౌజ్‌లు మునుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యారేజీల గరిష్ట నిల్వ మట్టం(ఎఫ్ఆర్ఎల్) కంటే ఎక్కువ ఎత్తులో పంప్‌హౌజ్‌లను కట్టాల్సి ఉండగా, తక్కువ ఎత్తులో నిర్మించడంతోనే సమస్యలొచ్చాయన్నారు.

నాటి మంత్రి ఒత్తిడితో భూగర్భంలో నిర్మించారు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కూడా పంప్‌హౌజ్‌లను భూఉపరితలంలో నిర్మించాలని సిఫారసు చేస్తే, నాటి మంత్రి ఒత్తిడితో భూగర్భంలో నిర్మించారని ఆరోపించారు. మోటార్లు ఎఫ్ఆర్ఎల్‌కి తక్కువ ఎత్తులో పెట్టినా పెద్దగా నష్టం ఉండదని, కంట్రోల్ ప్యానెళ్లు, స్టార్టర్లు మాత్రం ఎత్తులో ఉండాల్సిందేనన్నారు. పటేల్ కంపెనీ తీరుతోనే కల్వకుర్తి లిఫ్టులోని పంప్‌హౌజ్ నీటమునిగి భారీ నష్టం జరిగిందని ఆరోపించారు.

జిల్లా వార్తలు

ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు

ఖమ్మంమామిళ్లగూడెం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మూడో లైన్ నిర్మాణ పనుల కారణంగా ఇప్పటికే విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. అయితే, పనులు కొనసాగుతుండటంతో ఈ నిర్ణయం జనవరి 14వ తేదీ వరకు అమల్లో ఉంటుందని ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు. డోర్నకల్-విజయవాడ (07755), విజయవాడ-డోర్నకల్ (07756), భద్రాచలంరోడ్-విజయవాడ(07278), విజయవాడ-భద్రాచలంరోడ్ (07279) ప్యాసింజర్ రైళ్లు జనవరి 14వ తేదీ వరకు నడవవనే విషయాన్ని ప్రయాణికులు గమనించాలని సూచించారు.

వైరా వాసికి కేయూ నుంచి డాక్టరేట్



మేకల గాంధీ

ఖమ్మంసహకారనగర్: కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి అర్థశాస్త్ర విభాగం పరిశోధకుడు మేకల గాంధీకి డాక్టరేట్ లభించింది. 'ఇంపాక్ట్ ఆఫ్ డెయిరీ ఫార్మింగ్ ఇన్ జనరేషన్ ఆఫ్ ఇన్‌కమ్ - ఏ స్టడీ ఇన్ తెలంగాణ' అంశంపై ఆయన సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రకటించారు. ఖమ్మం జిల్లా వైరా మండలం అష్టగుర్తికి చెందిన గాంధీ కేయూ అర్థశాస్త్ర విభాగం ఆచార్యులు డాక్టర్ ఎం.పుష్పలత పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేయగా, పలువురు ఆయనను అభినందించారు.

ఆటాడేద్దాం.. రండి..

- నేటి నుంచి సుభాష్‌నగర్ గురుకులంలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు
- హాజరుకానున్న 1,200 మంది క్రీడాకారులు
- పూర్తయిన ఏర్పాట్లు, ముస్తాబైన క్రీడా ప్రాంగణం



పోటీల నిర్వహణకు ముస్తాబైన క్రీడా ప్రాంగణం (ఇన్‌సెట్) కోర్టులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ అరుణకుమారి, అధ్యాపకులు

ఇల్లెందురూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ గిరిజన గురుకుల పాఠశాలలో ఏడేళ్ల కిందట జోనల్ స్థాయి పోటీలు జరగగా.. ఇప్పుడు రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు ముస్తాబైంది. గిరిజన గురుకులాల విద్యార్థుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు గురువారం నుంచి నాలుగు రోజుల పాటు ఇక్కడ జరగనున్నాయి. ఈ మేరకు పోటీలను విజయవంతం చేయాలనే లక్ష్యంతో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వారం రోజులుగా శ్రమించి క్రీడా మైదానాన్ని సిద్ధం చేశారు. చుట్టూ రంగురంగుల జెండాలతో అలంకరించగా మైదానం కొత్త శోభను సంతరించుకుంది.

నాలుగు రోజులపాటు పోటీలు

మండలంలోని సుభాష్‌నగర్ బాలికల గిరిజన గురుకులాల ప్రాంగణంలో గురువారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు నాలుగు రోజులపాటు రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జోన్ల వారీగా అధికారులకు బాధ్యతలు అప్పగించగా ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. అలాగే, పోటీల నిర్వహణకు మైదానాలు సిద్ధం చేశారు.

1,200 మంది క్రీడాకారిణులు..

రాష్ట్రంలోని నాలుగు జోన్ల పరిధిలో ఒక్కో జోన్ నుంచి 300 మంది చొప్పున మొత్తం 1,200 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల కోసం ఇప్పటికే సుభాష్ నగర్ బాలికల గురుకులానికి చేరుకున్నారు. న్యాయనిర్ణేతలుగా 80 మందిని ఎంపిక చేయగా వీరు సైతం వచ్చారు. మొత్తంగా 1,280 మంది క్రీడాకారులు, శిక్షకులకు వసతి, ఇతర సదుపాయాల కల్పన బాధ్యతలను ఖమ్మం రీజియన్ పరిధిలోని అధికారులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు అప్పగించారు.

మూడు విభాగాలు.. 26 ఈవెంట్లు

గిరిజన గురుకులాల బాలికల రాష్ట్రస్థాయి పోటీలను అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో నిర్వహిస్తారు. ఇందులో కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, టెన్నీకాయిట్, ఫుట్‌బాల్, చెస్, క్యారమ్స్, బాక్సింగ్, బాల్‌బ్యాడ్మింటన్ తదితర 17 అంశాల్లో పోటీలు జరుగుతాయి. ఇందుకోసం కోర్టులను సిద్ధం చేశారు.

సందడిగా గురుకులం

ఇప్పటివరకు జోనల్ స్థాయి పోటీలకు మాత్రమే పరిమితమైన సుభాష్‌నగర్ గిరిజన గురుకులాల ప్రాంగణం రాష్ట్రస్థాయి పోటీలకు వేదికగా నిలవనుండటంతో అధ్యాపకులు, విద్యార్థుల్లో ఉత్సాహం నెలకొంది. వారం రోజులుగా కళాశాల ప్రాంగణాన్ని సిద్ధం చేయడంతోపాటు క్రీడాకారులను ఘనంగా స్వాగతించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలు కూడా గురువారమే మొదలు కానుండడంతో రాష్ట్రస్థాయి పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎవరు హాజరవుతారో ఇంకా స్పష్టత రాలేదు.

జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ జట్టు ఎంపిక



తెలంగాణ జట్టు కెప్టెన్‌గా ఎంపికైన వైష్ణవిరత్న

అశ్వాపురం: జాతీయస్థాయి అండర్-17 బాలికల పాఠశాలల స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు మంగళవారం ముగియగా, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన బుధవారం తెలంగాణ జట్టును ప్రకటించారు. జట్టు కెప్టెన్‌గా వైష్ణవిరత్న (భద్రాద్రి కొత్తగూడెం) ఎంపిక కాగా, సభ్యులుగా అనన్య, భాగ్య(ఖమ్మం), అక్షిత, హర్షిత, ధృతి, వైష్ణవి, స్నిగ్ధ (రంగారెడ్డి), స్వాతి, ఇందు, వైశాలి(మహబూబ్‌నగర్), శ్రీజ, వర్ష (నిజామాబాద్), అక్షయ (హైదరాబాద్), తులసిరెడ్డి(ఆదిలాబాద్), అస్మితసింగ్ (మెదక్) ఎంపికయ్యారు. అలాగే, స్టాండ్ బైగా ఝాన్సీ(ఖమ్మం), నాగశ్రీచరిత (రంగారెడ్డి), అక్షర (మహబూబ్‌నగర్)ను ఎంపిక చేశారు. ఈ జట్టు వచ్చేనెల కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రంలో జరిగే 67వ జాతీయస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని పీఈటీలు పోలెబోయిన అనిల్‌కుమార్, వీరన్న, ఆదినారాయణ, రాములమ్మ, జనార్దన్, దశమిబాబు తెలిపారు.

కెప్టెన్‌గా భద్రాద్రి జిల్లా బాలిక

జాతీయస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టు కెప్టెన్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన వైష్ణవిరత్న ఎంపికై ంది. ఆమె మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతూ భద్రాచలంలోని సబ్బు క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు కెప్టెన్‌గా అశ్వాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వైష్ణవిని తెలంగాణ జట్టు కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

చింతకాని: తెలంగాణ ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కోరారు. చింతకాని మండలం నాగులవంచలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొన్న పలువురు జైలు జీవితం అనుభవించడమే కాక ఆత్మబలిదానాలు చేసుకున్నారని తెలిపారు. అయినా వీరిని కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఫలితంగా ఉద్యమకారులు ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఏర్పడిన ప్రభుత్వమైనా ఉద్యమకారులపై కేసులు ఎత్తివేసి వారి సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని, ఇళ్లస్థలాల విషయంలో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రంగారావు కోరారు. కాగా, మార్చి 3వ తేదీ నుంచి ఖమ్మంలో జరగనున్న మూడు విప్లవ పార్టీల ఐక్యతా మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఆవుల అశోక్, కోలేటి నాగేశ్వరరావు, ఝాన్సీ, రాయల రవికుమార్, శోభ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల విజయవంతానికి కృషి చేయాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నాలుగు ఐటీడీఏల పరిధిలోని గిరిజన బాలబాలికలకు నిర్వహించనున్న జోనల్ స్థాయి క్రీడాపోటీల విజయవంతానికి అధికారులు కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏటీడీఓలతో భద్రాచలంలోని కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. జనవరి 4నుంచి 6వ తేదీ వరకు కిన్నెరసాని క్రీడా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు సుమారు 2 వేల మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా వసతి, భోజనం విషయంలో ఇబ్బంది ఎదురు కాకుండాఏర్పాట్లు చేయాలని, పోటీలకు మైదానాలను సిద్ధం చేయాలని చేయాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయి పోటీలు అయినందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈసమావేశంలో డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, అధికారులు రమణయ్య, గోపాలరావు, నర్సింహారావు, చంద్రమోహన్‌చ జహీరుద్దీన్, రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

మీ సేవ కేంద్రాల్లో క్యూ



కేఎంసీలోని మీ సేవ కేంద్రంలో రద్దీ

ఖమ్మంమయూరిసెంటర్: ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు మీసేవ కేంద్రాలకు బారులు దీరుతున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల కోసం 'ప్రజాపాలన' కార్యక్రమం ద్వారా గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తు వెంట ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తదితర జిరాక్స్‌లు సమర్పించాల్సి ఉండగా.. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం అడగలేదు. అయినా అవగాహన లేకపోవడంతో పలువురు ఖమ్మంలోని మీ సేవ కేంద్రాలకు బుధవారం క్యూ కట్టారు. ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలోని మీసేవ కేంద్రంలో కాలు పెట్టే స్థలం లేకుండా జనం చేరడంతో అధికారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జత చేయాల్సిన అవసరం లేదని సర్దిచెప్పారు.

సెమీస్‌కు దేవస్థానం, పోలీస్ జట్లు



'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అందజేస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని జూనియర్ కళాశాల మైదానంలో నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన స్నేహపూర్వక పోటీలో దేవస్థానం, పోలీస్ జట్లు సెమీస్‌కు చేరాయి. ఉదయం జరిగిన మ్యాచ్‌లో ప్రభుత్వ ఆస్పత్రి జట్టు, దేవస్థానం జట్టు తలపడగా దేవస్థానం జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో పోలీస్ లెవన్ జట్టు, రెవెన్యూ జట్టు తలపడగా పోలీస్ జట్టు గెలుపొందింది. దీంతో దేవస్థానం, పోలీసు జట్లు సెమీస్‌కు చేరగా, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బాలయోగి, అజీం, రాజారాం, సలీం, రామకృష్ణ, నాగార్జున, సదానందం తదితరులు పాల్గొన్నారు.